నీటి సరఫరా సమస్యలు పరిష్కరించాలి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో నీటి సరఫరా పైపులైన్లు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఆయన స్పందించి పనులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



డీసీ జకియా సుల్తానాతో అఖిలపక్ష నాయకులు

మల్కాజిగిరి: సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులకు సహకరించాలని అఖిలపక్ష నాయకులు సర్కిల్ నూతన డీసీ జకియా సుల్తానాకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. మల్కాజిగిరిలో ప్రస్తుతం భిన్నమైన రాజకీయ పరిస్థితులు ఉన్నాయని ప్రజలకు అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని కోరామన్నారు. నాయకులు నాగరాజు, జీడీ నవీన్‌గౌడ్, రామకృష్ణ, యాదయ్య, రమేష్‌గౌడ్, గోపి, చంద్రశేఖర్‌గౌడ్, విష్ణువర్ధన్, గౌతమ్, హేమంత్, వంశీ, ఉస్మాన్, భాస్కర్ ఉన్నారు.

అన్నదానం

మౌలాలి : ఆకలితో ఉన్న అన్నార్తుల ఆకలి తీర్చడం గొప్ప విషయమని పలువురు వక్తలు అన్నారు. మౌలాలి డివిజన్ చందాబాగ్‌లోని నల్లపోచమ్మ, ఎర్రపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఆలయ నిర్వాహకులు బుధవారం అన్నదానం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు వంశీముదిరాజ్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు.

మాసశివరాత్రి ప్రత్యేక పూజలు

గౌతంనగర్: మాసశివరాత్రి సందర్భంగా గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని దుర్గా జ్యోతిష్యాలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, రుద్రహోమం, అభిషేకాలు నిర్వహించినట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోడుప్పల్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చెంగిచర్ల ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కుర్రి శివశంకర్ అన్నారు. బుధవారం చెంగిచెర్లలో జరిగిన డిపో కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పెండింగ్ పీఆర్సీని వెంటనే ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను యాజమాన్యమే కొనుగోలు చేసి నడపాలని కోరారు. డిపో సెక్రటరీ సాయప్ప, అధ్యక్షులు శ్రీనివాస్, కోశాధికారి రాథోడ్ నాయక్ పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని ట్రస్టుకు లీజుకు ఇవ్వడంపై అభ్యంతరం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని రాధాకృష్ణ బాలాజీ ఆలయ స్థలాన్ని ముక్తి ధాం చారిటబుల్ ట్రస్ట్‌లకు లీజుకు ఇవ్వడంపై మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం దేవాదాయ శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ స్థలాన్ని స్థానికంగా ఉపయోగించాలని కోరారు. సర్వే నెంబర్–91లోని 1.10 గుంటల స్థలం ముక్తి ధాం చారిటబుల్ ట్రస్ట్‌కు కేటాయిస్తూ.. ఈనెల 4న జీవో జారీ చేసిందని, దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

కాప్రా: పదోతరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటన బుధవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేతి పాండు కుమారుడు సంతోష్, కోడలు సాయిపల్లవి నిజామాబాద్ జిల్లా భైంసా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని వేంకటేశ్వనగర్‌లో నివాసం ఉంటున్నారు. సంతోష్, సాయిపల్లవి దంపతుల 14 ఏళ్ల కుమారుడు రుషియేంద్రను ఏఎస్‌రావునగర్‌లోని భాష్యం స్కూల్‌లో చేర్పించారు. ప్రస్తుతం రుషియేంద్ర పదోతరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న తాత పాండుకు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9030959596.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా తదితరులు

మల్కాజిగిరి: జిల్లా కేంద్ర ఆసుపత్రి (ప్రభుత్వ వైద్య కళాశాల కుత్బుల్లాపూర్ ఆసుపత్రి)లో రోగులకు మెరుగైన సేవలందిస్తామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. వృద్ధుల చికిత్సా విభాగం, శిశు చికిత్సా విభాగంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీలో ఉన్న మందుల వివరాలు, వాటి గడువు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఏఏ అవసరాలు ఉన్నాయో.. అడిషనల్ కలెక్టర్ లోకల్‌బాడీస్, సూపరింటెండెంట్ ద్వారా తెలుసుకున్నామన్నారు.

వైద్య సేవలకు ప్రతిపాదనలు

ప్రధానంగా ఆపరేషన్ థియేటర్స్, ఐసీయూ విభాగం, బ్లడ్ బ్యాంక్ కావాల్సి ఉంటుందని తెలిపారన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టీజీఎంఎస్ ఐడీసీ నుంచి తీసుకుని జిల్లా పరిధిలో అనుమతులు మంజూరు చేసి పనులు పూర్తిచేస్తామన్నారు. కోవిడ్ సమయంలో సిద్ధం చేసిన అదనపు ఫ్లోర్‌ను కూడా రోగులు ఉపయోగించుకోవడానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని సూచించామన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి ఆదేశాలు ఉన్నాయని, చికిత్స కోసం వచ్చిన రోగులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వారికి పూర్తిస్థాయిలో చికిత్స అందేలా చూస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభరాజ్, సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ సంగీత్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సమన్వయ అధికారి డాక్టర్ సంగీత్‌తో కలెక్టర్

విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు : జిల్లా కలెక్టర్ మను చౌదరి

అల్వాల్: నేరెడ్‌మెట్‌లోని మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తాతో కలిసి సందర్శించారు. కళాశాలను సందర్శించి అవసరమైన మౌలిక వసతులు గురించి అడిగి తెలుసుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను అధిరోహించాలన్నారు. కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. కళాశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు త్వరగా చేపట్టాలని వినతి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నియోజకవర్గంలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ పనులు త్వరగా చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ ఆంజనేయరెడ్డి, చీఫ్ ఇంజనీర్ ఏహెచ్. మల్లికార్జున్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నేతలు మురుగేష్, మేకల రాము యాదవ్, డోలి రమేష్, సురేందర్‌రెడ్డి, శోభన్‌బాబు, ప్రభాకర్, ఉస్మాన్, వంశీముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్, నయీం, శ్రీకాంత్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోండి..

మౌలాలి: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి బ్రాంచ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు బుధవారం మౌలాలి డివిజన్ బండచెరువు లాల్‌వాణినగర్‌లోని సంస్థ కార్యాలయంలో లయన్స్‌క్లబ్‌ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి 44వ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం సందడిగా నిర్వహించారు. ఇన్‌స్టలేషన్ అధికారి జగన్మోహన్‌రెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు లింగారెడ్డి, రవీంద్రనాథ్‌గుప్తాలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ భవనానికి సొంత నిధులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.



రైల్వే అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే

నూతన కార్యవర్గం..

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దంతూరి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, ట్రెజరర్ సురేందర్‌రెడ్డిలు నియమితులయ్యారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కమలాకర్, మనోహర్‌రెడ్డి, ఎస్వీవై రెడ్డి, పాండురంగారావు, శ్రీనివాస్, వడ్డె సుబ్బారావు, బాలచందర్, బద్దం పరశురాంరెడ్డి, బీఆర్ఎస్ నేతలు జేపీసీ వెంకన్న, రాముయాదవ్ తదితరులున్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



గ్రీన్‌హిల్స్ కాలనీలో పర్యటిస్తున్న అధికారులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ అధికారులు పర్యటించారు. చిన్నపాటి వర్షానికి గ్రీన్‌హిల్స్ కాలనీలోని వరద నీరు ముంచెత్తి ఇళ్లలోకి వస్తున్నాయని, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌తో కాలనీవాసులు మొర పెట్టుకున్నారు. నిధులు మంజూరైనా పనులను వెంటను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కాప్రా ఏసీపీ కృష్ణమోహన్, డీఈ రూప, ఏఈ స్రవంతి, వాటర్ బోర్డు ఏఈ సిరాజుద్దీన్, మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయికిరణ్‌గౌడ్, కాలనీవాసులు విజయ్, అల్తాఫ్, మురళి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

మల్కాజిగిరి: డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ శ్రవణ్ గ్రేటర్ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీలో రైల్వేట్రాక్ పక్కన నాలా నిర్మాణం, పంచమీ హోటల్ నుంచి విష్ణుపురి వరకు సీసీ రోడ్డు, ఓపెన్‌జిమ్, బలరాంనగర్‌లో పైపులైన్, సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, నిధులు మంజూరు చేయించాలని కోరామన్నారు. జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ ఆదేశాలిచ్చారన్నారు.

స్ట్రీట్‌ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని స్వయంసహాయక సంఘాలు, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను కార్యాలయ సిబ్బంది, ఆర్పీలతో కలిసి బుధవారం కమిషనర్ త్రిలేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆదాయం, గుర్తింపుతో పాటుగా మార్కెట్‌లో రాణించుటకు గొప్ప అవకాశమన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీధి అహార విక్రయంలో పిండి వంటలు, మిల్లెట్స్, ఆర్గానిక్ ప్రొడక్ట్స్, చేతివృత్తుల వస్తువులు అల్లికలు, వివిధ రకాల పచ్చళ్లు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 25 వరకు జరిగే ఈ స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించాలని నగర ప్రజలను కోరారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఈఈ సాయినాథ్‌గౌడ్, ఏఈ వినిల్‌కుమార్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, బాలమురళీకృష్ణ, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.




స్ట్రీట్‌ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించిన కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లు షురూ

అల్వాల్: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మల్కాజిగిరిలో డిగ్రీ (అండర్ గ్రాడ్యుయేషన్) మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ అడవి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ, నేషనల్ ఓపెన్ స్కూల్, పదోతరగతి నుంచి అర్హత కలిగిన విద్యార్థినీవిద్యార్థులు అర్హులని, ఆగస్టు 13వ తేదీ వరకు నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



సాయి జథిన్

మేడిపల్లి: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లిలో నివాసం ఉంటున్న రవికుమార్ కుమారుడు సాయిజథిన్(22) నరాల సమస్యతో బాధపడుతున్నాడు. ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట మహిళ..



పల్లవి

మేడిపల్లి: భర్తతో గొడవపడి పిల్లలను ఇంట్లో వదిలి ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూర్ గ్రామానికి చెందిన వెంకన్న, పల్లవి (22) భార్యభర్తలు. కాగా వీరికి 6 ఏళ్ల క్రితం వివాహమైంది. బతుకుదెరువు కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో నివాసం ఉంటున్నారు. గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఈనెల 21న ఉదయం భార్య పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భర్త పలు ప్రాంతాల్లో వెతికినా.. ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మి

అల్వాల్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో నివసించే నాగటి లక్ష్మి (55) మానసికస్థితి సరిగ్గా లేదు. ఈనెల 16న ఆమె తన కుమారుడు శ్రీకాలనీలోని చర్చికి తీసుకెళ్లి అక్కడే ఉంచాడు. 18న ఉదయం ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు రూ.30 లక్షల నిధులు !

ఉప్పల్: ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే ఉప్పల్ నల్లపోచమ్మ, మహంకాళి అమ్మవారికి ఆలయాల వద్ద సౌకర్యాల కల్పనకు రూ.30 లక్షలు మంజూరైనట్లు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ నిధులతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వివిధ విభాగాల అధికారులతో ఆమె చర్చించారు . ఈఈ హరిలాల్, డీఈ చందన, ఏఈ రాజ్‌కుమార్, ఏఈ నరేష్‌రెడ్డి, స్థానిక గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రామంతాపూర్ : ఇందిరానగర్‌కు చెందిన శ్రీనివాస్ ఇంటిని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో ఇంటి ప్రాంగణంలో ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దీనిపై కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని వారిని అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, అశోక్, శంకర్, సందీప్ తదితరులున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

బోడుప్పల్: అంబేద్కర్‌నగర్ కాలనీ వీధినెంబర్ 9లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఊరటి మహేష్, రహీం బుధవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో వేసిన డ్రైనేజీ పైపులైన్లు పాడై డ్రైనేజీకు ఆటంకం కలుగుతుందన్నారు. అంబేద్కర్‌నగర్ చౌరస్తా వద్ద వర్షం పడినప్పుడల్లా డ్రైనేజీ పొంగి పొర్లుతుందన్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్య లేకుండా పరిష్కరించాలని వారు కోరారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి చేయూత



బోడుప్పల్: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి చేయూతనిద్దామని కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్‌లో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నరేష్ కుటుంబానికి మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా స్టీల్ ఫర్నిచర్, వెల్డింగ్‌వర్క్స్ ఏర్పాటుకు ఆయన సహకరించి, ప్రారంభోత్సవానికి ఆయన హాజరై బుధవారం ప్రారంభించారు. పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, ఎస్ఎస్ఏ ట్రస్ట్ చైర్మన్ సాయి, బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రాసాల మహేష్‌యాదవ్, వేణు, ప్రకాష్‌రెడ్డి తదితరులున్నారు.

బంగారు దుకాణదారులతో పోలీసుల సమావేశం

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారు దుకాణదారులతో మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్, మేడిపల్లి పలు సెక్టార్ల ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బంగారుషాపు యజమానులకు అవగాహన కలిస్తూ.. తప్పనిసరిగా సీసీకెమెరాలు, అలారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. లాకర్లను సేఫ్టీగా పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11కేవీ ఏఎన్ఎస్ ఫీడర్, 11 కేవీ ఈస్ట్ చంద్రగిరి కాలనీ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

◆ వసంతపురి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ ప్రకటించారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో రాఘవేంద్రకాలనీ, లక్ష్మీనగర్(హుడా) తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా 11కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ట్యాంక్‌బండ్ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మినీ ట్యాంక్ బండ్, బలరాంనగర్, సీతారాంనగర్, శారదానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు వివరించారు.

ప్రజలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశం
- ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే పర్యటన

కాప్రా: బీఆర్ఎస్వీ శిక్షణా తరగతుల సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. బుధవారం ఏఎస్‌రావునగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 26న జరిగే ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రచారాలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్వీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ నేతలు సాయిజెనశేఖర్, ప్రవీణ్‌ముదిరాజ్, నాగేశ్వరరావు, భాస్కర్, బాలరాజు, నాగరాజు, బీఆర్ఎస్వీ నేతలు జైకృష్ణ, సంపత్, దినేష్, అద్వైత్ తదితరులున్నారు.

చిరు వ్యాపార సంఘం ప్రతినిధులతో..

కాప్రా: చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నేతలు బద్రొద్దీన్, ప్రవీణ్, జంపాల్‌రెడ్డి, యాదగిరి, జాంబవ్, లోకేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన.. బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే

కాప్రా: జై జైవాన్ కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. బుధవారం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారులకు తమ వ్యాపార సముదాయాలను ఖాళీ చేయాలని, జీహెచ్ఎంసీ నుంచి నోటీసులు వచ్చాయని ఎమ్మెల్యే దృష్టికి వారు తీసుకెళ్లారు. దీంతో ఆయన షాపింగ్ కాంప్లెక్స్ షటర్లను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో మాట్లాడారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కాలనీ అధ్యక్షుడు తిరుమలయ్య, బీఆర్ఎస్ నేతలు మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే